అంతరార్ధం అర్ధమైంది

శ్రీ ధాయిపులె బాలకృష్ణరావు

—(౦)—

నీలాకాశం వేపు నిరీక్షిస్తూ వుండిపోయాను. ఎందుకలా చూస్తున్నానో నాకే తెలీదు. చూస్తూ ఆలోచిస్తున్నాను అంటే అదిగూడ లేదు. మరైతే, ఎందుకు ఆకాశం వేపు చూడ్డం? అయినా యీ ప్రశ్నకు సమాధానం తట్టలేదు. చూస్తూ ఆలోచించడం లేదు. ఆలోచిస్తూ చూడ్డంలేదు. కావున శిలా ప్రతిమనయ్యాను.

కపాలంపై పడిన ముంగురులకు చల్లటి వాయు వీచికలవల్ల చైతన్యం వచ్చినట్లుంది. నాట్యం ఆరంభించాయి.

రాము వచ్చి చాల సేపయి వుంటుందేమో. అయినా అతను నా ప్రతిమాకారాన్ని చూసి నన్ను పలకరించనూలేదు. "ఇదొక వెర్రిబాగుల లోకం" అనుకున్నాడు.

ఆ లోకంలో అలా యెంతసేపుండిపోయానో నాకే తెలీదు. రాము యిక వుండబట్టలేక తన మామూలు ధోరణిలో అడిగాడు.

"ఓరేయి సీను, పోయిందిరా" అన్నాడు.

"ఊ" అనగలిగాను, కొద్దిగా యీ లోకంలోకి వస్తూ,

"ఏమిటి రా! ఊ" మనసులో నవ్వుకొని మరీ అడిగాడు.

"నువ్వు చెప్పిందేరా. నే నేమైనా కల్పితం చేస్తున్నానా" అన్నాను.

"అది కాదుర నీకు మతిపోయిందిరా అంతే."

"అవునవును. పోక యింకా వుంటుందా. ఇన్ని గడ్డు సమస్యల మధ్య తారాడుతున్న 'ఆలోచనల రిసర్వాయిర్'కి 'రెస్ట్' అనేది వుంటేకదూ!

ఏంలోకంరా బాబు! బయటి కెళ్ళితే నానా బ్రహ్మాస్త్ర ప్రయోగాలు. నిన్న మీ ఇంటికి వచ్చే దోవలో 'పింజరి' వాళ్ళ వీధినుండి వస్తున్నా. వాళ్ళ ప్రయోగాలు చూశావురా ఎలావున్నాయో! అరుగ మీదుండే వ్యక్తి నేను రావడం చూసి చెప్పడం ప్రారంభించాడు.

'ఓరే నాగిగా! చూశావురా ఆ అబ్బాయి బోలెడంత చదివాడు. కాయ కష్టం చేయడానికి కావల్సినన్ని కండలున్నయ్. ఏమైంది! అటు వుద్యోగం లేదు, యిటు ఏమైనా పనిచేస్తున్నాడ అంటే అదీ లేదు. బికారిలాగ బేకార్ కొడుతున్నాడు - చెప్పేవాళ్లులేక...' అంటూ ఒకే ధోరణిలో వాగడం. ఇది మెల్లగపోతూ విన్నా. వాడి లెక్చరు పైన చెప్పినంతవరకు విన్నాను. ఇక వుండలేక తిరిగి వెనక్కి చూచాను. అంతటితో వాడు "గప్ చిప్" నాకు నీలకంఠుని కున్నట్లు మూడవ కన్ను నిజముగవుండి వుంటే భస్మీపటలమై పోయేవాళ్లు. బద్మాష్‌లు!

మరోవైపు యెడతెగని ఇంటి సమస్యలు."

"ఇంటి సమస్యలతో నీకేం పనిరా, చూసేవాళ్లు చూసుకుంటారు. తల్లిదండ్రులున్నంతవరకు దిగులెందుకురా... పోతే, నీవేమైనా పెళ్ళిఅయిన వాడివా అంటే అదీలేదు. పెండ్లి అయివుంటే_

ఔరా! పాపం, భార్యపిల్లల్తో సతమత మౌతూ వేగలేక వేగుతున్నాడు" అనుకోవచ్చు. అలాంటి వేమి లేదుకదా ఇకపోతే, తిండి విషయమా అంటే అదేం కొదవలేదు.

హాయిగా నాకింకా" అంటూ పాట పాడ్తూ ఒక కాలుమీద మరోకాలు వేసుకొని తింటూ ఆనందానుభూతిని అనుభవింపవచ్చును. ఇంక నీకు వచ్చిన లోటేమిటిరా! "రాముకు తెలిసిందల్లా 'వెల్లగ్రక్కాడు.

"ఓరే రాము! నీకు పైకి బాహాటంగ కనబడే యీపై చిల్లరవిషయాలే తెలుసుగాని లోతైన దృష్టి లేదురా. వ్యక్తుల మనఃప్రవృత్తులనుగాని వారి సాధక బాధకాలను గూర్చిగాని తెలిసికోడానికి నీకు అంతకంటే 'సైకలాజికల్' దృష్టిలేదు. కష్టాలకు

భార్యా పిల్లలే కారకులు కావలెనా నీ దృష్టిలో? తిండి తక్కువ కావడమే సమస్యకు కారణ భూతము కావలెనా? సమస్యలంటే యెక్కడికి సమస్యలు? వచ్చేంతవరకూ సమస్యలే. ఆదిమధ్యాంతరహితమై అలరారే సమస్యలెన్నో! అయినా, యీ సమస్యల పరిష్కారానికి మానవుడు కృషిచేస్తూనే వున్నాడు — జీవితాంతము. సమస్యలకు - మానవులకు అన్యోన్య సంబంధమువుంది. దీనికంతా కారణము - సృష్టి పదార్థాలు పరిమితంగా వుండడము, మానవుని కోరికలు అపరిమితంగా వుండడము.”

ఇదంతా రాము మౌనంగ విన్నాడు.

చీకటిపడింది. ఆకాశంలో నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి...

“బెజవాడనుంచి వుత్తరం వచ్చిందట — అది పెళ్ళి సంబంధాల వుత్తరం. రేపు వాళ్ళిక్కడికి వస్తున్నారు. అబ్బాయిని చూడ్డానికి. అయితే అబ్బాయికి యీ సంబంధమంటే పూర్తిగ విరుద్ధం. కాని, వాడి తల్లిదండ్రులకు యిష్టంగవుంది... ఈ సమస్య యెలారా తెగేది?” పరీక్షించేందుకు రాముని అడిగాను.

“అంతమాత్రానికే సమస్య ముడిని తీసుకు రావాలిరా! దాని నివృత్తికి మార్గం తెలీదూ! మీ నాన్న, అమ్మ చెప్పినట్లు చేసికోవడం మంచిది... మరి ఎందుకైనా మంచిది.” అదోలాగన్నాడు. వాడి జవాబు నాకు నవ్వు ఆపిందికాదు. రాము సమాధానాలు యెందుకలా వుంటాయంటే దానికి కారణం లేకపోలేదు. రాము యిలాంటి జీవిత సమస్యల్నిగాని, భవితవ్య పరిణామాలనుగాని, ఆలోచించి యెరుగడు. పరిణామాల పరిమాణాల్నిగూడ కొలువడు. రెండవదేమంటే, ఆస్తిపాస్తులు బాగున్నవాళ్లు కాబట్టి వాడికి యీ సమస్యల్ని గురించి బుర్రను వేడెక్కించడం అలవాటులేదు.

“నాయీ సమస్య పరిష్కార ఫలితం ఏ రూపం దాలుస్తుందో భవిష్యత్తులో చూద్దువులే రాము! నేననుకుంటుండేది ఒకటి. తల్లిదండ్రులనుకుంటుండేది మరియొకటి. వీటికి పైగా విధిబలీయ ప్రమేయము వుంది. కాబట్టి యీ సమస్య పై మూడింటి మీద ఆధారపడివుంది. చివరికి యేది నెగ్గుతుందో?” అంటూ ముగించాను. రాముకిదంతా అవగాహనం కాలేదు. నా అస్పష్టమైన భావం రాము ఊహనా శక్తికి అందని పండు. అందుకతను కష్టపడదుగూడ. అర్రులు చాచితే వచ్చేదేమంటాడు?

రాము నా దగ్గరనుండి శెలవు తీసుకున్నాడు. మరి, రేపటికి రమ్మన్నాను. సరే అంటూ చిరునవ్వుతో తలూపాడు. రాము చిరునవ్వు నాకు అదోలా తోచింది. “ఎప్పుడూ ఆలోచనలేనా” అన్నట్లు ఆ దరహాసపు తెర వెనుక భావము గోచరించింది. అయినా, ఇది మామూలేగా కడుపునిండి అవలించేవాళ్ళకు. రాము కలవారి అబ్బాయి. దిగులు లేదు, బుగులు లేదు, అసలు దిగులు పడవల్సిన గత్యంతరము ఏముందని? కావలసినంత ఆస్తివుంది. వాళ్ళింట్లో వుండేవాళ్ళేగాక, మరీ పదిమంది వచ్చి జీవితాంతము ఏ కాయకష్టము లేకుండ, తినినాగాని వుండే ఆస్తి కరగదు...

రేపటి కథ యెలా జరుగుతుందోరా బాబు అంటూ ఆలోచనా సముద్రంలో మునిగిపోయాను. అమ్మ పిలుపు వినబడింది. ముఖం మీద యెవరో నీళ్లు చల్లినట్లయింది అమ్మ పిలుపుకు. సోఫాలో కూర్చున్నవాడిని తీరాలేచి ఇంట్లోకి దారి తీసాను.

“అమ్మా... ఏమ్మా పిలిచావు” ఆప్యాయంగా అడిగాను.

“చూడు నాయనా! ఎలాగో ఒకలాగు నిర్ణయించుకో. తల్లిదండ్రుల మనసు కష్టపెడితే నీకేం వస్తుందని”

“అది కాదమ్మా పెళ్ళి చేసికోడం నా యిష్టమా, మీ యిష్టమా నువ్వే చెప్పమ్మా. ఇష్టములేని అమ్మాయిలను చేసుకొని బాగుపడిన వాడెవడైనా వున్నాడా?”

“అదికాదు నాయనా! చూడూ — మీ నాన్న ఎక్కడ పడితే అక్కడ అప్పులు చేశాడు — నీ చదువుకోసం. ఎలాగో, ఆ దేవుని ధర్మమా అంటూ నీచదువు పూర్తయింది. ఏదో యెక్కువ కట్నం యిచ్చేవాళ్ళ అమ్మాయినే చేసుకుంటే...” నా కళ్ళలో యెర్రజీరలు, కోపంతో రెండు పెదవులూ అప్రయత్నంగా

అదిమాను. సమంగా వుండే కనుబొమ్మలు 'బ్యాలన్సు' తప్పిపోయింది.

"చేసుకుంటే..." కోపంతో గట్టిగా అడిగాను. అమ్మ అదిరింది. తడబడుతూ చెప్పింది.

"మీ నాన్నకు సంతృప్తి నాయనా! మొదటి సంబంధము—అంటే — బందరునుంచి వచ్చిన వాళ్ల అమ్మాయే కాదు, కుటుంబములోని వాళ్లంతా గౌరవ మర్యాదలు కలవాళ్లు. అందులోనే పుట్టి పెరిగారు. మంచిదే కాని నాయనా! వాళ్లు ససేమిరా ఐదు వేల కంటె యెక్కువ కట్నం యివ్వజాలమంటారు."

"అయితే యీ బెజవాడ వాళ్లు ధర యెంత పలికారో?" వ్యంగ్యంగా అడిగాను. ఇష్టంలేని వాటిని గురించి అంతకంటే మరోవిధంగ అడగలేకపోయాను.

"చూడు నాయనా! బెజవాడవాళ్లు ఇరవై వేలు యిస్తామంటూ మీ నాన్నకు వుత్తరము వ్రాశారు. మంచి సంబంధము; ఏదో అమ్మాయి యెడమకాలికి వాయియట. కొద్దిగా అడుగులు తడబడుతుంటాయి. చిన్నప్పుడు వాళ్ళనాన్న బెత్తముతో ఒక చిన్న దెబ్బ కొట్టగా, అలా వాయి వచ్చిందట. అప్పటి నుంచి అది అలాగే వుందట. అయినా,-ఏం బాబూ! మనకు కట్నం బోలెడంత వస్తుందిగా మంచి సంబంధము బాబూ." అమ్మ పెదవులపై యెక్కడలేని చిరునవ్వు తొణికిసలాడింది. కాని అది భయాందోళనతో మిళితమై వుండే చిరునవ్వు అని స్పష్టమౌతూంది. అమ్మకు నేనేమనుకుంటానో అన్న భయమే అలాంటి చిరునవ్వును పుట్టించింది.

'అమ్మా, నాన్నవాళ్లు సంబంధాల్ని యే దృక్కోణముతో చూస్తున్నారో?' నాకర్థమైంది. వీళ్ళ మాటల అంతరార్థం స్పష్టమైంది. సంబధాల్ని విలువ కట్టేది కుటుంబ గౌరవ మర్యాదల్ని బట్టిగాని, అమ్మాయి గుణశీలాల్ని బట్టిగాని కాదు. డబ్బు... డబ్బు సంచులు యెక్కడి నుండైతే బరువుగా నెత్తి మీదికి వచ్చిపడతాయో ఆ వేపుకు వేలెత్తి చూపెడతారు—అటు వేపు యేమైనా వుండనీ.

"అంటే మీరు డబ్బుల్నిబట్టి సంబంధాల విలువల్ని కడుతున్నారన్నమాట. అలాంటి సంబధము నేను చచ్చినాగాని చేసుకోనమ్మా... నాన్నతో చెప్పు..." అంటూ కోపంతో బయటికి వెళ్ళబోయాను. నాన్న నా వెనకాలే నిలబడివున్నాడు. కోపంతో ముందుకు అడుగువేయబోయాను. అయితే, వినయ, నమ్రతలు నా దారికి అడ్డుతగిలాయి. పెద్దలయెడ వుండే పూజ్యత, గౌరవము నాలో నశించలేదు. ఇక ఒక అంగుళము గూడ ముందుకు పోలేకపోయాను.

నాన్నను చూస్తునే కళ్ళనుండి నీళ్ళు కారాయి. నాన్న కళ్ళు అప్రయత్నంగ చెమ్మగిల్లాయి. ప్రజల నేత్రాలనుండి ఆనందభాష్పాలు రాలాయి. నా బాధను అర్థంచేసుకున్నాడు కాబోలు

"సెభాష్! నీలాంటి కొడుకు నా కుండవల్సిన వాడేరా! నీ యిష్టానుసారం కార్యసిద్ధి." అన్నాడు నాన్న-తడికండ్లను పల్లెవాటుతో వత్తుకుంటూ... నా ఆనందానికి అంతులేకపోయింది. నిజంగ, నాన్నను మనస్సులో అభినందించుకున్నాను.

నాన్న అమ్మతో చెప్పాడు.

"ఏమేవ్! నీ కొడుక్కు వున్నంత తెలివి నీకు లేకపోయిందే. ఆడవాళ్ళకు శీలము, వన్నె చెడని ఆభరణమే. ఈ శీలాభరణాన్ని చెడగకుండా, ఏ కళంకము రాకుండా జాగ్రత్త వహించడం వాళ్ళ పాలిటి ధర్మం. ఈ సత్యాన్ని మరచిన వాళ్ళకుగాని, విరుద్ధమైన వాళ్ళకుగాని తగిన ప్రతిఫలము ముట్టుతుంది. శీలము లేనివాళ్ళకు నెత్తిన యెంత బంగారు పెట్టితే మాత్రం వాళ్ళ విలువ యెంతే? కుక్కకు యెన్ని బంగారు తొడుగులు యెక్కించినా, యెన్ని వన్నె బట్టలు తొడిగించినా, కుక్క కుక్కేకదే!... ఈ రోజే బెజవాడలో వుండే నా ఆప్తమిత్రునివద్ద నుండి వుత్తరం వచ్చింది. రేపు రాబోయె బెజవాడ సంబంధము మంచిది కాదని, అమ్మాయి మంచిది కాదని వ్రాశాడు. ఇప్పుడైనా తెలిసిందా."

"ఇంక అర్థమైంది లెండి" అమ్మ తలూపింది. నాన్న చిలిపినవ్వు నవ్వాడు.

ఇరవై వేల కట్నము అంతర్గార్థము ఇప్పుడైనా అర్థమైంది గదా అని సంతోషిస్తూ, అక్కడినుండి భోజనాల గదిలోనికి ఆనందంతో యెగిరిపోయాను.